APTEL/26A5612

# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు

తెలుగు దినపత్రిక

అనంతపురం | మంగళవారం 29 సెప్టెంబర్ 2026 | సంపుటి : 1 | సంచిక : 91 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | పేజీలు : 8 | వెల : 2/-

## రిజర్వాయర్ల నిర్వహణకు రూ.160 కోట్లు విడుదల




- మంత్రి నిమ్మల రామానాయుడు
- గత ప్రభుత్వం రద్దు చేసిన సాగునీటి సంఘాల వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ధరించి రైతులకు కొండంత భరోసా కల్పించారు
- ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న పరిమిత జల వనరులను సమర్థవంతంగా వినియోగించడంలో సాగునీటి సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి

**అమరావతి**

కాలువలు, డ్రెయిన్లు, రిజర్వాయర్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) పనులకు సంబంధించి రూ.160 కోట్ల బిల్లులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురై, దెబ్బతిన్న సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి గాడిలో పెడుతోందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన సాగునీటి సంఘాల వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ధరించి రైతులకు కొండంత భరోసా కల్పించారని- మిగతా3లో



## హర్మూజ్ జలసంధి నుంచి అమెరికా దళాలను తరిమికొట్టాం

- హెజ్‌బొల్లా మాజీ నాయకుడు హసన్ నస్రల్లా వర్ధంతి సందర్భంగా మొజ్తబా ఖమేనీ ఇరాన్ పౌరులను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశం
- అమెరికా మళ్లీ దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ విదేశాంగమంత్రి వార్నింగ్
- త్వరలోనే శత్రువులను అరేబియా సముద్రం నుంచి కూడా తరిమికొడతాం
- హర్మూజ్ జలసంధిలో శత్రుదేశాలు స్వేచ్ఛగా సంచరించకుండా తమ దళాలు అడ్డుకున్నాయి

### జలవనరుల పరిరక్షణ, కాలుష్య నివారణకు

# ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- జలవనరులు కలుషితం కాకుండా చూడాలని ఆదేశం
- ఆక్వా వ్యర్థాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష
- ఆక్వా వ్యర్థాల నుంచి వచ్చే అనర్థాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు
- ప్రాసెసింగ్ యూనిట్లలో పర్యావరణ ప్రమాణాల అమలుకు ప్రత్యేక పర్యవేక్షణ
- పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, భూగర్భ జలాలు కాలుష్యం బారినపడుతున్నాయి



**అమరావతి**

ఆక్వా వ్యర్థాల కారణంగా జలవనరులు కలుషితం కాకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్? ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా ప్రాసెసింగ్, ఆక్వా ప్రీ-ప్రాసెసింగ్ యూనిట్లు నిర్దేశిత పర్యావరణ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. ఆక్వా కాలుష్యంపై ఇవాళ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. శుద్ధి చేయని ఆక్వా వ్యర్థాల్లో పరిమితికి మించి హానికారక రసాయనాలు ఉండడం వల్ల నదులు, కాలువలు, భూగర్భ జలాలు కాలుష్యం - మిగతా3లో

### 'సర్' వివాదం

## సీఈసీ రాజీనామాకు ఖర్గే డిమాండ్.. ప్రతిపక్షంపై నడ్డా ఫైర్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆరోపణలు
- ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాల విమర్శలు
- ఖర్గే వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చిన కేంద్ర మంత్రి జేపీ నడ్డా



# 1.66 లక్షల మంది అనర్హులు

- అక్టోబర్ 9న ఓటర్ల తుది జాబితా
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో అవసరమైన వివరాలు నింపలేదని ఓటర్లకు నోటీసులు జారీ
- 44,24,411 మంది విచారణను ఆదివారానికి పూర్తి చేసింది.
- తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 9న విడుదల
- 1.66 లక్షల మందిని అనర్హులుగా తేల్చిన ఈసీ



**అమరావతి**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో అవసరమైన వివరాలను నింపకపోవడం, తప్పులు, అసంపూర్ణంగా సమాచారాన్ని అందించడం వంటి కారణాలతో నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లకు సంబంధించిన విచారణను భారత ఎన్నికల సంఘం ఆదివారానికి పూర్తి చేసింది.

అనర్హులుగా 1,66,279 మంది : నోటీసులు అందుకున్న 44,24,411 మంది ఓటర్లలో 1,66,279 మందిని అనర్హులుగా తేల్చింది. 42,01,092 మందిని తుది జాబితాలో కొనసాగించాలని నిర్ణయించింది. మరో 57,040 మంది విచారణ పూర్తయినప్పటికీ వారు సమర్పించిన ఆధారాల పరిశీలన కొనసాగుతోంది. 4,434 మంది విచారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. అర్హులుగా 96 శాతం మంది : జులై 31న ఎన్నికల సంఘం ముసాయిదా జాబితా విడుదల చేసింది. 3,71,38,182 మంది ఓటర్ల వివరాలను అందులో ప్రచురించింది. ఎన్యూమరేషన్ పత్రాల్లో వివరాలు సరిగ్గా నింపలేదనే కారణంతో 44,28,845 మందికి నోటీసులిచ్చింది. దాదాపు విచారణ పూర్తి చేసి 96 శాతం మందిని - మిగతా3లో



## నేపాల్‌లో జలవిలయం..

- 6 సెకన్లలో కళ్లముందే కుప్పకూలి నదిలో కలిసిపోయిన భారీ కొండ
- ఈ ఘోర విపత్తుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి
- వరదలు, కొండచరియల వల్ల 24 మంది మృతి, పలువురు గల్లంతు
- హిమపాతంలో చిక్కుకుని మరో ఇద్దరు మృతి, 10 మంది గల్లంతు

## తుఫాన్ నష్టం

- 44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు
- 1,734 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం
- ఎన్యుమరేషన్‌లో వేగం పెంచాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు



**అమరావతి**

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టానికి సంబంధించిన ఎన్యుమరేషన్ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. తుఫాన్ కారణంగా పంటలకు జరిగిన నష్టంపై అందిన ప్రాథమిక నివేదికలు, ఇప్పటివరకు జరిగిన ఎన్యుమరేషన్ పురోగతిని మంత్రి సమీక్షించారు. తుఫాన్ ప్రభావంతో వివిధ జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టాన్ని పక్కాగా గుర్తించడం అత్యంత ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. బాధిత రైతుల వివరాల నమోదులో ఎలాంటి లోపాలకు తావులేకుండా, - మిగతా3లో

## భారత్‌తో మాది మంచి భాగస్వామ్యం

- కానీ ఉపయోగించుకోలేకపోయాం: ఆస్ట్రేలియా ప్రధాని
- భారత్, ఆస్ట్రేలియా భాగస్వామ్యం మరింత పెరగాల్సి ఉందన్న అల్బనీస్
- ప్రధాని మోదీతో కలిసి సంబంధాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్న ఆస్ట్రేలియా ప్రధాని
- డిసెంబరులో భారత్‌కు వ్యాపార ప్రతినిధి బృందంతో పర్యటన



## తెలంగాణ సీజేకు ప్రమోషన్

- ముగ్గురు జడ్జిలను సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- మూడు రాష్ట్రాల హైకోర్టు సీజేలను సుప్రీంకోర్టు జడ్జిలుగా పదోన్నతికి సిఫారసు
- తెలంగాణ, గుజరాత్, ఢిల్లీ హైకోర్టు సీజేల పదోన్నతికి సిఫారసు
- నేటి సమావేశంలో సిఫారసుకు ఆమోదం తెలిపిన కొలీజియం



# తెలుగు స్వరం

సామాన్యుడి గుండె చప్పుడు

# రాయల సీమ



అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా


## యువతే భవితకు భరోసా..!!

.....శ్రీ వెంకటేశ్వర ఫిజియోథెరపీ మరియు ఆదర్శ నర్సింగ్ కళాశాలలో "యువత భవితకు భరోసా" కార్యక్రమం.

అనంత... ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ప్రారంభం.



సి ఎస్ ఆర్ తో బస్‌షెల్టర్లు, ఆర్వో ప్లాంట్లు.. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీకి మంత్రి సవిత అభినందనలు

వైసీపీ అజెండా స్కామ్‌లు, అవినీతి.

బైక్ మీద వెళ్లి 11 వార్డులో పర్యటించిన మంత్రి సవిత

## అభివృద్ధి పనులే.... మా పాలనకు నిదర్శనం..!!



**పెనుకొండ సెప్టెంబర్ 28 తెలుగు స్వరం.**

ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం, అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.అభివృద్ధి పనులే మా పాలనకు నిదర్శనమని మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలో 11 వార్డులో మంత్రి సవిత పర్యటించారు...తన ఇంటి నుండి బైక్ ర్యాలీగా పరమేశ్వరపురం, వెంకటాపురం తాండా కు చేరుకుని ప్రజలతో మాట్లాడారు. స్థానిక సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ 5 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. అలాగే సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన =ా వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈశ్వర్ రబ్బర్ ఫ్యాక్టరీ సి ఎస్ ఆర్ నిధులతో సుమారు రూ.50 లక్షల విలువైన బస్ షెల్టర్లు, అర్ ఓ ప్లాంట్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

- మిగతా3లో





## అర్జీలపై నిర్లక్ష్యం వద్దు..!!

.....ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

..... జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్

....అందిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలి

.....ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 337 అర్జీలు స్వీకరణ



**పుట్టపర్తి, సెప్టెంబర్ 28: తెలుగు స్వరం.**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి రైల్వే స్టేషన్ సమీపంలోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిశీలించి అర్హత మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మొత్తం 337 అర్జీలు రాగా, వాటిపై తగు చర్యలు తీసుకుని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ,ఎస్‌డిసి విజయ కుమారి తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## లోకల్ ఎలక్షన్‌లో .... బరిలో పోరుకు సిద్ధం..!!

.....జనసేన పార్టీని బలోపేతం చేయాలి చిలకం మధుసూదన్ రెడ్డి..,

....స్థానిక సంస్థ ఎన్నికల్లో జనసేన అభ్యర్థులను బరిలో దించుతాం..



**కదిరి, నంబులపూలకుంట, సెప్టెంబర్ 28, తెలుగు స్వరం (బ్యూరో)**

కదిరి నియోజకవర్గంలో జనసేన పార్టీ తరపున స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జనసేన అభ్యర్థులను బరిలో దించేందుకు చిలకం మధుసూదన్ రెడ్డి ఆర్ అండ్ బి బంగ్లాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి సమక్షంలో జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 30 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు.శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి నియోజకవర్గంలోని కదిరి మున్సిపాలిటీకి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త చిలకం మధుసూదన రెడ్డి శనివారం ఆశావహులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కదిరి నియోజకవర్గ ఇంచార్జ్ భైరవ ప్రసాద్ , కోఆర్డినేషన్ టీమ్ కమిటీ సభ్యులు పత్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన రెడ్డి మాట్లాడుతూ కదిరి మున్సిపాలిటీలో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికలకు సమర్థవంతమైన సన్నాహాలు, ప్రజలతో మరింత బలమైన అనుసంధానం వంటి అంశాలపై ఆశావహులతో చర్చించారు. ప్రతి ఒక్కరి అభిప్రాయాలను,

- మిగతా3లో



# 1.66 లక్షల మంది అనర్హులు

-మొదటిపేజీ తరువాయి

అర్హులుగా తేల్చింది.

మిగతా 3,27,09,337 ఓటర్లలో 3,27,08,479 మందిని తుది జాబితాలో కొనసాగించేందుకు అర్హులుగా గుర్తించింది. మరో 858 మందికి సంబంధించిన విచారణ పెండింగ్‌లో ఉంది. ఓటు హక్కు నమోదుకు కొత్తగా వచ్చిన ఫాం–6లలో 85,736, చిరునామాలు, పేర్లు, ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులకు వచ్చిన ఫాం–8లలో 40,991, అనర్హుల ఓట్లు తొలగించాలంటూ వచ్చిన ఫాం–7లలో 9,296 దరఖాస్తుల విచారణ పెండింగ్‌లో ఉంది.

పెండింగ్ దరఖాస్తుల విచారణను అక్టోబరు 5కల్లా పూర్తిచేసి 9న తుది జాబితా ప్రచురించనుంది.

### అత్యధికంగా అనంతపురం జిల్లాలో

నోటీసులందుకున్న ఓటర్లలో అత్యధికంగా అనంతపురం జిల్లాలో 22,943 మంది, తిరుపతి జిల్లాలో 19,596 మంది, పల్నాడులో 18,843 మంది, ఎన్టీఆర్ జిల్లాలో 12,509, అన్నమయ్యలో 12,098 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 11,227 మందిని అనర్హులుగా తేల్చారు.

### గుర్తించిన లోపాలు

ఎన్యూమరేషన్ పత్రాల పరిశీలనలో తల్లిదండ్రులు -- పిల్లల మధ్య వయస్సు తేడా 15 ఏళ్ల కంటే తక్కువగా, 50 ఏళ్ల కంటే ఎక్కువగా నమోదు కావడం, ఓటరు--తాత లేదా నాన్నమ్మ మధ్య వయస్సు తేడా 40 ఏళ్ల కంటే తక్కువగా



ఉండటం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. అలాగే ప్రస్తుత జాబితా, 2002 జాబితాలో తండ్రి పేరులో తేడాలు ఉండటం, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయస్సు తేడా 9 నెలల కంటే తక్కువగా నమోదు కావడం, ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల వివరాల్లో తప్పులు వంటి లోపాలు కూడా వెలుగుచూశాయి.

# విజయవాడ ఉత్సవం-2.0ను విజయవంతం చేద్దాం

కేశినేని శివనా ధ్

**విజయవాడ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని దేశానికి చాటడమే లక్ష్యం -మంత్రి సత్య కుమార్ యాదవ్**

**విజయవాడ :** విజయవాడ నగర సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పడంతో పాటు పర్యాటక రంగం, స్థానిక వ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటకశాఖ, సహకారం తో సొసైటీ ఫర్ వైబ్రేంట్ విజయవాడ వారు నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవం--2.0కు కర్టెన్ రైజర్ కార్యక్రమం ఘనంగా జరిగింది.గత ఏడాది ప్రజల భాగస్వామ్యంతో విజయవాడ ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో, ఈ ఏడాది మరింత వైభవంగా విజయవాడ ఉత్సవం--2.0 నిర్వహిస్తున్నట్లు విజయవాడ ఎంపీ,కేశినేని చిన్ని తెలిపారు. విజయవాడ ఉత్సవం నిర్వహణకు తాను చేసిన ఆలోచనకు ప్రభుత్వం, మంత్రులు, ప్రజలు, వివిధ వర్గాల నుంచి లభిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం ఒక సాంస్కృతిక కార్యక్రమం కాదని, విజయవాడ నగర బ్రాండ్‌ను మరింతగా పెంచడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, స్థానిక ఉపాధి అవకాశాలకు వేదికగా నిలవాలన్నదే ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.దసరా సందర్భంగా విజయవాడకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో, నగర ప్రజలు వారికి ఆతిథ్య భావంతో స్వాగతం పలకాలని ఎంపీ చిన్ని పిలుపునిచ్చారు. ప్రతి ఇల్లు, ప్రతి వ్యాపార సంస్థ దసరా, విజయవాడ ఉత్స వాల సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించుకుని నగరాన్ని పండుగ వాతావరణంలోకి తీసుకురావాలని కోరారు. విజయవాడ ఉత్సవానికి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల ద్వారా స్థానిక వ్యాపారులు, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, కళాకారులు తదితర వర్గాలకు ఆదాయ, ఉపాధి అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు.

### 650 స్టాళ్లతో నేషనల్ సరస్ మేళా

విజయవాడ పున్నమి ఘాట్‌లో తొలిసారిగా నేషనల్ సరస్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీ చిన్ని తెలిపారు. దేశవ్యాప్తంగా డ్వాక్రా, స్వయం సహాయక సంఘాల మహిళలకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. మొత్తం 650 స్టాళ్లు ఏర్పాటు




చేస్తుండగా, వాటిలో ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘాలకు 230 స్టాళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో విజయవాడ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, మంత్రి కందుల దుర్గేష్, ఇన్‌చార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ అందిస్తున్న సహకారానికి ఎంపీ చిన్ని కృతజ్ఞతలు తెలిపారు.

### విజయవాడ వైభవాన్ని ప్రపంచానికి చాటుతున్నాం: మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడకు చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవం ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడ ఉత్సవాల ద్వారా నగర ప్రాశస్త్యాన్ని ప్రపంచానికి చాటుతున్నామని తెలిపారు.విజయవాడ ఉత్సవాల ఆలోచన చేసి, ప్రజల భాగస్వామ్యంతో వాటిని నిర్వహించేందుకు చొరవ తీసుకున్న ఎంపీ కేశినేని చిన్ని అభినందనీయుడని అన్నారు. ఉత్సవాల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు.దసరా సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. విజయవాడ ఉత్సవాలు కేవలం సాంస్కృతిక కార్యక్రమం కాదని, పర్యాటక అభివృద్ధి, స్థానిక ఉపాధి, వ్యాపార అవకాశాల పెంపునకు వేదికగా నిలుస్తాయని చెప్పారు. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం కుటుంబాలను బలోపేతం చేస్తుందని, మహిళా సంక్షేమ కార్యక్రమాలు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తున్నాయని మంత్రి తెలిపారు. విజయవాడ ఉత్సవాల స్ఫూర్తితో ధర్మవరంలో సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్ సత్య కుమార్ యాదవ్,ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా,వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ కార్పొరేషన్ చైర్మన్లు పట్టాభివివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# జాతీయ రాజకీయాల్లో జగన్ దారెటు

**హైదరాబాద్ :** కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామకం, సవరణ చట్టంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోషల్ మీడియాలో చేసిన ప్రకటన జాతీయ స్థాయిలో పెద్ద దుమారాన్నే రేపింది. పరీక్ష రాసే విద్యార్థే ఎగ్జామినర్‌ను నియమించుకున్నట్లుగా ప్రభుత్వమే సీఈసీని ఎంచుకోవడం ఏంటి " అని జగన్ లేవనెత్తిన ప్రశ్న సహేతుకమైనదే అయినప్పటికీ, దానికి ఆయన ఎంచుకున్న సమయం, గతంలో ఆయన పార్టీ తీసుకున్న పార్లమెంటరీ నిర్ణయాలు ఆయన రాజకీయ విధానాలను ప్రశ్నించేలా చేస్తున్నాయి. నిన్నటివరకు కేంద్ర చట్టాలకు సభలో మద్దతు పలికి, ఇప్పుడు విమర్శలకు దిగడంపై జాతీయ విపక్షాలు జగన్ మోహన్ రెడ్డిని ద్వంద్వ నీతి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలకు కారణం అవుతున్నాయి. ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్రా సోషల్ మీడియా వేదికగా జగన్‌కు నేరుగానే ఘాటు కౌంటర్ ఇచ్చారు. వ్యవస్థలను ధ్వంసం చేసే వారికి ముందు పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వడం ఆపండి.. ఆ తర్వాత గ్యాలరీ సమాధానాల కోసం మాట్లాడండి అంటూ ఆమె నేరుగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి ని తప్పిస్తూ కేంద్రం తీసుకువచ్చిన బిల్లుకు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతు పలికిన విషయాన్ని, కనీసం వాకౌట్ కూడా చేయకపోవడాన్ని ఈ సందర్భంగా జాతీయ నేతలు గుర్తు చేస్తున్నారు.వైఎస్ జగన్ రాజకీయ విధానంలో అనుసరిస్తున్న అంశాల వారీ మద్దతు వ్యూహమే ఆయనను డిఫెన్స్‌లో పడేస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.



అధికారంలో ఉన్నప్పుడు కేంద్రంలోని బీజేపీకి దాదాపు ప్రతి కీలక బిల్లు ఆర్టికల్ 370 రద్దు, త్రిపుల్ తలాక్, ఢిల్లీ సర్వీసెస్ బిల్లు, ఈసీ నియామక బిల్లు ముందస్తుగా మద్దతు పలికి, ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక అవే నిర్ణయాలను తప్పుపట్టడం వల్ల ఆయన రాజకీయ విశ్వసనీయత దెబ్బతింటోంది. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి బీజేపీ విధానాలను మొదటి నుంచీ సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తుంటే, జగన్ మాత్రం సొంత రాష్ట్రాభివృద్ధి లేదా ఇతర సమీకరణాల పేరుతో కేంద్రానికి సహకరించారు. అయితే ఇప్పుడు ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత, ఎన్నికల కమిషన్ తీరుపై సొంతంగా అనుమానాలు వచ్చినప్పుడు మాత్రమే గళం విప్పడం వల్ల, జాతీయ విపక్షాలు ఆయనను సులభమైన రాజకీయ అవకాశవాది గా చూసే పరిస్థితి ఏర్పడింది. ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం లేదా పొలిటికల్ ఐడియాలజీ లేకపోవడం వల్లనే ఆయన తీరుపై ఇలాంటి విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ స్థాయిలో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ వంటివి జగన్ వైఖరిని ఎండగడుతున్నాయి. ముందు పాలసీ ప్రకారం రాజకీయాలు చేయండి.. బీజేపీ తెచ్చే ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులను పార్లమెంట్‌లో ఓడించకుండా మద్దతు ఇచ్చి, తీరా నష్టం జరిగిన తర్వాత రోడ్డెక్కి మాట్లాడటం వల్ల ఉపయోగం లేదు అని ఆయా పార్టీలు హెచ్చరిస్తున్నాయి. కేంద్రంతో వైఎస్సార్‌సీపీకి ఉన్న లోపాయికారీ అవగాహన వల్లే వారు ఇలా సగం దూరంలో ఆగిపోతున్నారనే ప్రచారం వ్యాపిస్తోంది. ఈ పరిణామాలు జగన్ మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుకు , జాతీయ ఇమేజ్‌కు పెద్ద పరీక్షగా మారాయి. మారుతున్న రాజకీయాల్లో మధ్యస్థ వైఖరి, అవకాశవాద మద్దతు పనిచేయదని, ఏదో ఒక వైపు స్పష్టమైన స్టాండ్ తీసుకోవాల్సిందేనని ఈ వివాదం స్పష్టం చేస్తోంది. మరి ఇప్పటికైనా జగన్ తన జాతీయ రాజకీయ విధానంపై స్పష్టత తెచ్చుకుంటారో లేదా ఇలాగే డబుల్ గేమ్ విమర్శలను ఎదుర్కొంటూ సాగుతారో వేచి చూడాలి.

## లోకల్ ఎలక్షన్ లో .... బరిలో పోరుకు సిద్ధం..!!

-మొదటిపేజీ తరువాయి

స్థానిక పరిస్థితులను, ఎన్నికలకు సంబంధించిన అంశాలను సమగ్రంగాతెలుసుకున్నారు. అనంతరం కదిరి ఆర్అండ్ బి బంగ్లాలో వన్ టూ వన్ సమావేశాలు నిర్వహించి, ప్రతి ఒక్కరి అభిప్రాయాలు విడివిడిగా చిలకం మధుసూదన రెడ్డి , తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారి అభిప్రాయాలు, సూచనలు, స్థానికంగా ఉన్న పరిస్థితులు మరియు ఎన్నికలకు సంబంధించిన అంశాలపై వివరంగా చర్చించారు. పార్టీ నిర్ణయానికి అనుగుణంగా సమష్టిగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా జనసేన పార్టీ సిద్ధాంతాలు పవన్ కళ్యాణ్ ఆశయాలను నచ్చి 30 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి శ్రీ చిలకం మధుసూదన రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కదిరి పట్టణ అధ్యక్షులు కాయల చలపతి, లక్ష్మణ కుటాల, ఇర్ఫాన్,అంజిబాబు ,కిన్నెర మహేష్ , రాజేంద్ర ప్రసాద్, ఈటీ లోకేష్,చక్రధర్ బాబు , హరి బాబు,కొట్టే అశ్వర్థ మండల నాయకులు భుక్య రవీంద్ర నాయక్,మేకల చెరువు చౌదరి,సాకే రవి కుమార్, కె.విరమణ , అన్నం జయవర్ధన్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్, శ్రీనివాసులు,రెడ్డెమ్మ,జయశ్రీ మరియు జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులే....మా పాలనకు నిదర్శనం..!!

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా వారికి మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు.అర్హులైన 50 మంది గ్రామస్తులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. . అర్హులైన వారికి కొత్త పెన్షన్లు, గృహ నిర్మాణం తదితర సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

పెనుకొండ మున్సిపాలిటీలో సుమారు రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కోసం నిధులు కేటాయించామని తెలిపారు..పట్టణంలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, రవాణా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. .

"మా అజెండా అభివృద్ధి.. ప్రజలకు మౌలిక వసతులు, సంక్షేమం అందించడమని . గత వైసీపీ ప్రభుత్వ అజెండా నరకడం ,స్కామ్ లు,డోర్ డెలివరీ లు చేయడమని మంత్రి సవిత విమర్శించారు.. ప్రజలకు ఏం చేశామో పనుల రూపంలో చూపించడం, అర్హులకు సంక్షేమాన్ని అందించడం, పెనుకొండను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని మంత్రి సవిత స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యువతే భవితకు భరోసా..!!




**అనంతపురం, సెప్టెంబర్ 28 తెలుగు స్వరం.** అనంతపురం రూరల్‌లోని శ్రీ వెంకటేశ్వర ఫిజియోథెరపీ మరియు ఆదర్శ నర్సింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎంపీ మాట్లాడుతూ, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కల్పనకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తన ప్రతిభ, నైపుణ్యాలను నిరూపించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య సేవా రంగంలో ఫిజియోథెరపిస్టులు, నర్సుల సేవలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, విద్యార్థులు తమ విద్యతో పాటు మానవతా విలువలను అలవర్చుకుని సమాజానికి సేవ చేయాలన్నారు. అలాగే జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల నిర్మాణం మరియు మరమ్మతులతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందేలా కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## తుఫాన్ నష్టం..

-మొదటిపేజీ తరువాయి

ప్రతి రైతు పంట నష్టాన్ని సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 89 మండలాలు, 351 గ్రామాల్లో ఉద్యానవన పంటలు ప్రభావితమయ్యాయి. మొత్తం 1,734 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతినగా, 5,777 మంది రైతులు పంట నష్టానికి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు 445 హెక్టార్లకు సంబంధించి 950 మంది రైతుల పంట నష్టం ఎన్యుమరేషన్‌ను పూర్తి చేశారు. ఇంకా 1,289 హెక్టార్లకు సంబంధించిన పంట నష్టం వివరాలను నమోదు చేయాల్సి ఉందని అధికారులు మంత్రికి వివరించారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం 190 మండలాల్లోని 1,229 గ్రామాలు తుఫాన్ ప్రభావానికి గురయ్యాయి. మొత్తం 71,796 మంది రైతులకు పంట నష్టం జరిగినట్లు గుర్తించగా, సుమారు 44,029 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇప్పటివరకు 19 మండలాల్లోని 45 గ్రామాలకు చెందిన 726 మంది రైతుల పంట నష్టానికి సంబంధించిన ఎన్యుమరేషన్‌ను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుత ఎన్యుమరేషన్ పురోగతిని సమీక్షించిన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల జాయింట్ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన అధికారులు సహా క్షేత్రస్థాయి సిబ్బంది పంట నష్టాల ఎన్యుమరేషన్‌ను అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమంగా తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, ఏ ఒక్క బాధిత రైతు వివరాలు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. పంట నష్టం వివరాల నమోదులో పారదర్శకత, కచ్చితత్వం పాటించాలని, వాస్తవంగా నష్టపోయిన ప్రతి రైతు వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, జిల్లాల వారీగా, పంటల వారీగా సమగ్ర నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## జాషువా సాహిత్యం సామాజిక చైతన్యానికి దిక్సూచి- శివరామకృష్ణ

పెనుకొండలో జాషువా చిత్రపటానికి నివాళులు



**పెనుకొండ సెప్టెంబర్ 28 తెలుగు స్వరం:** కవి సామ్రాట్ గుర్రం జాషువా తన రచనల ద్వారా సమాజంలో మార్పు, చైతన్యం తీసుకురావడానికి కృషి చేసిన మహనీయుడని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది బి.శివరామకృష్ణ పేర్కొన్నారు. పెనుకొండ ఆర్అండ్బీ అతిథి గృహంలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుర్రం జాషువా 131వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సాహిత్య సేవలను కొనియాడారు. శివరామకృష్ణ మాట్లాడుతూ.. ఆనాటి సామాజిక పరిస్థితులను తన రచనల్లో ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు జాషువా విశేషంగా కృషి చేశారని తెలిపారు. గబ్బిలం, ఫిరదౌసి వంటి రచనలు ఆయన సాహితీ ప్రతిభకు నిదర్శనమన్నారు. సామాజిక వివక్ష, అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ వెనుకడుగు వేయకుండా రచనలు కొనసాగించి సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన సాహిత్య సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించిందన్నారు. కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, గౌరవాధ్యక్షుడు వెంకటేష్, ట్రెజరర్ హరిపురం రామాంజినప్ప, గౌరవ సలహాదారు కదిరప్ప, రాయలసీమ ఉపాధ్యక్షుడు చల్లపల్లి ఈశ్వర్, వాల్మీకి బాబు, కోనాపురం కౌన్సిలర్ మారుతి, కొల్లప్ప శశి, లక్ష్మణ్, నారాయణ నాయక్, నాగరాజు, ఓబులపతి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభ్యర్థుల బయోడేటాలు పరిశీలకులకు అందజేత



**పెనుకొండ సెప్టెంబర్ 28 తెలుగు స్వరం:** సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గానికి చెందిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థుల బయోడేటాలను పార్టీ పరిశీలకులకు అందజేశారు. హిందూపురం పార్లమెంట్ అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు సమక్షంలో అభ్యర్థుల వివరాలను అందించారు. పెనుకొండ నియోజకవర్గం ఆరుగురు సభ్యుల కమిటీ సభ్యులు అభ్యర్థుల బయోడేటాలను పరిశీలకులకు సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మాజీ జెడ్పీటీసీ నారాయణస్వామి, పెనుకొండ జనసేన ఇన్ ఛార్జ్ కుమార్‌తో పాటు ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గోనిపేటకు సెల్ టవర్ మంజూరు

ఎంపీ పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపిన గోనిపేట ప్రజలు



**పెనుకొండ సెప్టెంబర్ 28 తెలుగు స్వరం:** పెనుకొండ రూరల్ మండలం గోనిపేట గ్రామంలో మొబైల్ సిగ్నల్ సమస్యకు పరిష్కారం లభించింది. సిగ్నల్ అందక గ్రామ ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 2024 ఎన్నికల ప్రచార సమయంలో నూతన సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని హిందూపురం పార్లమెంటు సభ్యులు బీకే పార్థసారథి హామీ ఇచ్చారు. హామీ మేరకు ప్రస్తుతం నూతన సెల్ టవర్ ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి. దీంతో గ్రామంలో మొబైల్ సిగ్నల్ సమస్య తీరనుండటంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన ఎంపీ బీకే పార్థసారథికి గోనిపేట గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## అమరాపురం లో ఘనంగా అంగన్ వాడి వారోత్సవాలు



**అమరాపురం సెప్టెంబర్ 28 తెలుగు స్వరం. అమరాపురం..** స్థానిక మండల కేంద్రంలోని 5వ నంబర్ అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ వారోత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు కేఎన్ఎం రత్నమ్మ నరసింహమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, సింగల్ విండో డైరెక్టర్ దాదు, నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బిటి చెన్నప్ప, మదనకుంట రఘు యాదవ్,అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్న పిల్లలు, గర్భిణులు మరియు బాలింతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. సమతుల్య ఆహారం, పోషకాహారం మరియు ముర్రుపాల ప్రాముఖ్యతపై మహిళలకు విస్తృత అవగాహన కల్పించారు. అలాగే పూర్వ ప్రాథమిక విద్య ద్వారా పిల్లల్లో క్రమశిక్షణ, అభ్యాసన నైపుణ్యాలు మెరుగవుతాయని తెలిపారు. అనంతరం కేంద్రంలో పోషకాహార పదార్థాలను గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్ ప్రాంగణాన్ని రంగురంగుల పోస్టర్లతో అందంగా అలంకరించి, పిల్లల విద్యా ప్రదర్శనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొని వారోత్సవాలను జయప్రదం చేశారు.

## ఎన్‌పికుంట తాసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు ధర్నా....



**నంబులపూలకుంట, సెప్టెంబర్ 28 తెలుగు స్వరం బ్యూరో,** స్థానిక మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ వద్ద వీఆర్ఏలు తమ సమస్యలపై శనివార ప్లేకార్డుతో ధర్నా నిర్వహించారు . వీఆర్ఏల సమస్యలను తాహసిల్దార్ లక్ష్మమ్మ అడిగి తెలుసుకొన్నరు. సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూప్రస్తుతం అందుతున్న వీఆర్ఏలకు నెలసరి అందుతున్న రూ,10 వేలతో కుటుంబాలను పోషించడం కష్టం ఉందని,తమకు పే స్కేల్ అమలు చేయాలని,నామినీగా విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏలను రెగ్యులర్ చేయాలని,ప్రమోషన్ కోటాను 30 శాతం నుంచి 70 శాతానికి పెంచడంతోపాటు కారణ్యా నియమాకాలను వెంటనే చేపట్టాలని తాసిల్దార్ లక్ష్మమ్మ కోరారు ఈ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తానన్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు రమేష్, రమణ, రూప, తదితరులు పాల్గొన్నారు.

## పెనుకొండ మున్సిపల్ ఎన్నికలకు ఎంపీ పార్థసారథికి దరఖాస్తులు సమర్పణ



**పెనుకొండ సెప్టెంబర్ 28 తెలుగు స్వరం:** పెనుకొండ మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న పలువురు అభ్యర్థులు తమ బయోడేటాలను హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథికి సమర్పించారు. పెనుకొండ పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న పార్లమెంట్ సభ్యుల కార్యాలయంలో అభ్యర్థులు తమ వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా 21వ వార్డు కౌన్సిలర్ మరియు చైర్మన్ అభ్యర్థిగా రవిశంకర్, 15వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రసాద్, 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులుగా చంద్రమౌళి (నాని), పల్లి శ్రీనివాసులు, 9వ వార్డు కౌన్సిలర్ మరియు చైర్మన్ అభ్యర్థిగా వాజీద్, 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా షబ్బీర్ (చీమ్‌ఖీ), 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా వడ్డీ శ్రీనివాసులు తమ బయోడేటాలను ఎంపీ బీకే పార్థసారథికి అందజేశారు. పెనుకొండ మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సంబంధించి అభ్యర్థులు తమ ఆసక్తిని వ్యక్తం చేస్తూ బయోడేటాలను సమర్పించినట్లు తెలిపారు.

## పెనుకొండలో అన్నా క్యాంటీన్ ను పరిశీలించిన మంత్రి సవిత

ప్రజలతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి సవిత







**పెనుకొండ సెప్టెంబర్ 28 తెలుగు స్వరం:** పెనుకొండ పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అల్పాహారం చేస్తున్న ప్రజలతో మాట్లాడి , వారికి అందుతున్న భోజన వసతులు, ఆహార నాణ్యత, క్యాంటీన్‌లోని సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత ప్రజలతో కలిసి అన్న క్యాంటీన్‌లో అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి, అన్న క్యాంటీన్‌లో అందుతున్న ఆహారం ఎలా ఉందో వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రూ.5కే కడుపునిండా అల్పాహారం అందుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అన్న క్యాంటీన్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను మంత్రి సవిత పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆహారం అందేలా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ భగత్ సింగ్ సేవలు చిరస్మరణీయం

సర్దార్ భగత్ సింగ్ విగ్రహానికి నివాళులు అర్పించిన మంత్రి



పెనుకొండ సెప్టెంబర్ 28 తెలుగు స్వరం: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా పెనుకొండలో ఆయన విగ్రహానికి మంత్రి సవితమ్మ గారు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగం, ఆయన చూపిన ధైర్యం, నిస్వార్థ దేశభక్తి చిరస్మరణీయమని అన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన భగత్ సింగ్ వంటి మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని పేర్కొన్నారు.భగత్ సింగ్ ఆశయాలు, దేశభక్తి నేటి తరానికి నిరంతరం స్ఫూర్తినిస్తాయని మంత్రి అన్నారు. యువత దేశ ప్రగతి, సమాజ హితం కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయడమే అమరవీరులకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ టీడీపీ కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి: బీజేపీ నాయకులు పార్థసారథి రెడ్డి





**సోమందేపల్లి, సెప్టెంబర్ 28 తెలుగు స్వరం:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ యువ నాయకులు పార్థసారథి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పార్థ వైద్యశిబిరం పాల్గొని ప్రజలకు అందుతున్న వైద్యసేవలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన ఆర్యవైశ్య సంఘం సభ్యులను అభినందించారు. అనంతరం బీజేపీ నాయకులు పార్థసారథి రెడ్డి, మండల అధ్యక్షుడు మంజునాథ్ ను ఆర్యవైశ్య సంఘం నాయకులు సుకుమార్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తిరుపతిలోని శ్రీ రమాదేవి మల్టీస్పెసియాలిటీ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆర్థో, యూరాలజీ తదితర వైద్య చికిత్సలకు దాదాపు 120 మంది పాల్గొనగా 24 మందిని చేస్తున్నట్లు తిరుపతి కి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రాలే చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాదులు

-- అంగన్వాడీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

-- రాష్ట్ర మంత్రి సవిత





**సోమందేపల్లి, సెప్టెంబర్ 28 తెలుగు స్వరం:** అంగన్వాడీ కేంద్రాలే చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాదులు అని రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని, ప్రజాసేవలో ఆయన 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం మండల కేంద్రం లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సేవా సంకల్ప్ అభియాన్ -- ఆంగన్ కా ఉత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోషణ మాసం కార్యక్రమానికి ఈ సందర్భంగా మంత్రి సవిత గర్భిణులకు పసుపు--కుంకుమతో సామూహిక శ్రీమంతం నిర్వహించి, తల్లులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, తల్లులతో మమేకమైన మంత్రి అంగన్వాడీ కేంద్రంలో అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించారు. పిల్లలకు అందుతున్న పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలను పరిశీలించిన మంత్రి.. గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గర్భంలో బిడ్డ పడిన నాటి నుంచి ఐదేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లులు, చిన్నారుల సంక్షేమానికి ఐసీడీఎస్ శాఖ అండగా నిలుస్తోందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు కేవలం ఆహారం అందించే కేంద్రాలు మాత్రమే కాదని, పిల్లల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య, మానసిక--శారీరక అభివృద్ధికి పునాది వేసే కేంద్రాలని పేర్కొన్నారు. అంగన్వాడీ ఉద్యోగులను గుర్తించి వారి సంక్షేమానికి చర్యలు తీసుకున్నది చంద్రబాబు నాయుడు ప్రభుత్వమేనని మంత్రి తెలిపారు. అంగన్వాడీ టీచర్ల జీతాలను రూ.4,200 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. ప్రస్తుతం అంగన్వాడీ సిబ్బందికి రూ.12 వేల జీతం అందిస్తున్నామని తెలిపారు. అంగన్వాడీ సిబ్బందికి కూడా అమ్మ ఒడి పథకం ప్రయోజనం అందేలా మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా అంగన్వాడీ సిబ్బందికి సెలవు దినాలను పెంచినట్లు తెలిపారు. మన అంగన్వాడీ మన బాధ్యత.. మన పిల్లల ఆరోగ్యం -- మనందరి బాధ్యత అనే సందేశంతో ప్రతి కుటుంబం అంగన్వాడీ కేంద్రాల సేవల్లో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి తల్లి, ప్రతి చిన్నారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

-- అంగన్వాడీ సిబ్బందికి ఘన సన్మానం

మండల వ్యాప్తంగా సేవలందిస్తున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలను మంత్రి సవిత ఘనంగా సన్మానించారు. చిన్నారులు, తల్లుల సంక్షేమం కోసం అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను మంత్రి అభినందించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సీడీపీఓ, సూపర్‌వైజర్ శుభారాణి, తహసిల్దార్ మారుతి,మండల విద్యాధికారి ఆంజనేయుల నాయక్, టీడీపీ మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు డివి ఆంజనేయులు, వడ్డే సూరి, శ్రీరాములు, ఇర్ఫాన్, సఫీ, సూర్యనారాయణ, గ్రామ సచివాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరాపురంలో అంగన్వాడి ఉత్సవాలు



**అమరాపురం సెప్టెంబర్ 28: తెలుగు స్వరం.** మండల కేంద్రంలోని 5 వ అంగన్‌వాడీ కేంద్రంలో 'సేవా సంకల్ప అభియాన్' భాగంలో భాగంగా అంగన్‌వాడీ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ జెడ్పిటిసి కె నరసింహమూర్తి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, సింగల్ విండ డైరెక్టర్ దాదు, రఘు యాదవ్, చెన్నప్ప మరియు సీడీఎస్ సూపర్‌వైజర్ సన్నక్క హాజరై ఐదవ అంగన్వాడి కేంద్రం కార్యకర్త నాగమణి మరియు హెల్పర్ల అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ముందస్తు ప్రాథమిక విద్య వారి సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్క్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు ఘనంగా శ్రీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించి, వారికి పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కేంద్రంలో ఉత్తమ సేవలు అందించిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళలు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A5612 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881